సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 26 । నవంబర్ । 2024



కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా సీనియర్ కబడ్డీ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లాలో జరిగే పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. 8లో ▸



ప్రజారోగ్యంపై కక్ష ?

కూటమి ప్రభుత్వ పాలనలో వైద్యం పడకేసింది. గద్దెనెక్కి ఐదు నెలలు దాటుతున్నా ఇప్పటివరకు ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించడం లేదు. 8లో ▸



ఇద్దరు అరెస్ట్

ఏలూరు నగరంలో పలు కార్లను అద్దెకు తీసుకుని ఉడాయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరు కార్లను రికవరీ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు తదితర సమస్యలపై 11 మంది అర్జీలు అందజేశారు. పలు సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్‌శాఖ ఉండాలని ఎస్పీ అన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

27న సివిల్స్ శిక్షణకు స్క్రీనింగ్

ఏలూరు (టూటౌన్): సివిల్స్ పరీక్షల ఉచిత శిక్షణ కోసం ఈనెల 27న రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు జిల్లాలో 12 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి అదేరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు గంట ముందు రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌కు వెళ్లి రిపోర్ట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7569184335లో సంప్రదించాలని కోరారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా విస్తృత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వచ్చే నెల 10 వరకు మహిళలను స్వేచ్ఛగా బతకనిద్దాం, స్వేచ్ఛగా ఎదగనిద్దాం అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. బాల్యవివాహాల నివారణకు చర్యలు తీసుకోవాలని, మహిళలపై దాడులు అరికట్టాలని అన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వరు పాల్గొన్నారు.

పెద్దింటికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న పెద్దింటి ఆచార్యులు

నరసాపురం రూరల్: వేములదీవిలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు అలంకార బ్రహ్మ బిరుదు పేరుతో అవార్డు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో వేదఖాన్ ట్రస్ట్, వైఖానస యూత్ ఫారమ్ సంయుక్తంగా ఆయనకు అవార్డు అందజేశారు. వేంకటేశ్వరస్వామికి వేలాది అలంకారాలు చేసినందుకు గుర్తింపుగా అవార్డు ప్రదానం చేశారు.

నిబంధనలు కాలరాసి.. కంకర తవ్వేసి..

యమకంకరులు

- యథేచ్ఛగా ఎర్ర కంకర తవ్వకాలు
- ఆరుగొలనులో రాత్రీపగలూ తేడా లేకుండా తరలింపు
- లేఅవుట్ల పూడికకు వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కాలువ గట్టు.. కొల్లగొట్టు..

జగ్గన్నపేటలో తాడిపూడి కాలువ గట్టు ఇలా..





గుట్ట.. గుల్ల.. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో తవ్వేస్తున్న ఎర్ర కంకర

తాడేపల్లిగూడెం రూరల్: నిబంధనలకు పాతర వేస్తూ తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో ఎర్ర కంకర తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జిల్లాపరిషత్‌కు చెందిన భూములతో పాటు ఆరుగొలను, కొత్తూరు రెవెన్యూ పరిధిలో దాదాపు 150 నుంచి 200 ఎకరాల్లో ఎర్ర కంకర తవ్వకాలు సాగుతున్నట్టు తెలిసింది. అసలు లీజుదారుల నుంచి కంకర మాఫియా వాటిని స్వాధీనం చేసుకుని మరీ ఈ తవ్వకాలు చేస్తున్నట్టు సమాచారం. అధికారికంగా 20 అడుగుల మేర మాత్రమే ఇక్కడ కంకర తవ్వకాలు జరగాల్సి ఉంది. దీనికి తోడు అంతర్గత ఒప్పందం 30 అడుగులుగా తెలుస్తోంది. అయితే కంకర మాఫియా మాత్రం 100 అడుగుల పైగా లోతుకు వెళ్లి మరీ కంకరను తవ్వేస్తున్నట్టు కనిపిస్తోంది. రైతు తన భూమి తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు, లారీల ద్వారా కంకర లేదా మట్టిని బయటకు తరలిస్తే మైనింగ్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రీ పగలూ తేడా లేకుండా కంకరను తవ్వి స్థానిక అవసరాలతో పాటు అంతర్ జిల్లాలకు సైతం తరలిస్తున్నారు. ఇంతలా మాఫియా రెచ్చిపోతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో గ్రామం నుంచి లారీలు వెళ్తుండటంతో అప్పట్లో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో లారీలు గ్రామంలోకి రాకుండా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అప్రోచ్ రోడ్డు మీదుగా తరలిస్తున్నారు. ఇటీవల తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వెలిసిన అనధికారిక లేఅవుట్ల పూడికకు ఇక్కడ నుంచే కంకర తరలిపోతుంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

భూమి గల రైతుల నుంచి కంకర తవ్వకం నిమిత్తం తక్కువ ధరను కంకర మాఫియా చెల్లిస్తోంది. అయితే కంకర తవ్వకాలకు సంబంధించి మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. అటువంటి అనుమతులు కంకర మాఫియా వద్ద ఉన్నాయా ? అంటే ప్రశ్నార్థకమే. దీంతో మైనింగ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. మాఫియా మాత్రం కోట్ల రూపాయల ఆదాయాన్ని గడిస్తోంది. అధికారులు దాడులు నిర్వహించిన సందర్భంలో వారికి తాయిలాలు అందిస్తూ మాఫియా చేతులు దులుపుకుంటుందనే ఆరోపణలు ఉన్నాయి. దాడులు సైతం నామ మాత్రమే అని తెలుస్తోంది.

సబ్ డివిజన్‌లో కానరాని మైనింగ్ శాఖ

తాడేపల్లిగూడెం సబ్ డివిజన్‌గా మారిన తర్వాత ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. అయితే, తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను, కొత్తూరు రెవెన్యూ పరిధిలో పెద్ద ఎత్తున కంకర తవ్వకాలు జరుగుతున్నా వాటిని అరికట్టే దిశగా మైనింగ్ శాఖ కార్యాలయం, అధికారులు ఇక్కడ లేకపోవడం శోచనీయం. జిల్లా, అంతర్ జిల్లాలకు ఇక్కడ నుంచి కంకర తరలిపోతున్నా మైనింగ్ అధికారులు మిన్నకుండటం విశేషం. ఇదిలా ఉండగా తాడిపూడి కాలువ గట్టు సైతం కంకర మాఫియా దాటికి కనుమరుగైపోతోంది. దీంతో సమీప రైతులు గట్టును సైతం ఆక్రమించి సాగు చేసుకోవడం విశేషం. అధికారులను ప్రశ్నిస్తే దాటవేసే ధోరణిలో వ్యవహరించడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కంకర, గ్రావెల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమ్మెలోకి కుయ్.. కుయ్..

- నిలిచిన 108 సేవలు
- ఉమ్మడి జిల్లాలో 51 వాహనాలు.. 250 మంది సిబ్బంది



108 వాహనం ముందు నల్లరిబ్బన్‌తో నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఏలూరు(టూటౌన్): చర్చలు విఫలం కావడం, ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 108 సిబ్బంది సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఏలూరు జిల్లాలోని 28 వాహనాల పరిధిలో 140 మంది పైలెట్లు, ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్)లు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 23 వాహనాలు, 110 మంది పైలెట్లు, ఈఎంటీలు మొత్తంగా 51 వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీటి పరిధిలో పనిచేస్తున్న 250 మంది సిబ్బంది సమ్మెలో ఉన్నారు. కొంతకాలంగా 108 సర్వీసులను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, పాడైన వాహనాలకు బాగు చేయించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని షిఫ్ట్ విధానాన్ని అమలుచేయాలని 108 సిబ్బంది కోరుతున్నారు. ఈ క్రమంలో వారం క్రితం రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద 108 సిబ్బంది ధర్నాలు నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈనెల 25లోపు తమ సమస్యలను పరిష్కరించకుంటే 25న అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తామని ముందుగానే హెచ్చరించినా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము సమ్మెబాట పట్టినట్లు 108 ఉద్యోగుల సంఘం నాయకులు చెబుతున్నారు.

ప్రభుత్వం స్పందించలేదు



ముందస్తుగానే 108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా కనీసం పట్టించుకోలేదు. కలెక్టరేట్ల ముందు చేసిన ధర్నా సందర్భంగా కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంతో సైతం ఈనెల 25లోపు ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె చేస్తామని తెలియజేశాం. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో గత్యంతరం లేక సమ్మె బాట పట్టాల్సి వచ్చింది. ప్రజలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.

– ఇబ్బా ప్రసాద్, 108, ఉద్యోగుల సంఘం, జిల్లా అధ్యక్షుడు, ఏలూరు జిల్లా

క్షీరారామంలో ఆర్‌జేసీ



స్వామి సన్నిధిలో ఆర్‌జేసీ సుబ్బారావు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) కె.సుబ్బారావు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వాసు శేషవస్త్రంతో సత్కరించి, స్వామి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వామివారిని దర్శించి ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపం వెలిగించారు.

‘మీకోసం’కు హాజరుకాకుంటే చర్యలు

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరిక



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జరిగే మీకోసం కార్యక్రమానికి హాజరుకాకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో మీకోసంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లాలో 20 మండలాల తహసీల్దార్ల కార్యాలయంలో జరుగుతున్న మీకోసం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా పలుచోట్ల పూర్తి స్థాయిలో అధికారులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి వరుసగా మూడు వారాల పాటు హాజరుకాని వారి వివరాలు సేకరించి సస్పెండ్ చేసే వరకూ చర్యలు చేపడతామన్నారు. సమాచారం ఇవ్వకుండా సెలవులు పెట్టిన అధికారులపై ఉదాసీనంగా వ్యవహరించిన ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవన్నారు.


అధికారుల డుమ్మా

ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు ఆర్డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే పలుచోట్ల అధికారులు డుమ్మా కొట్టడంతో ప్రజలు భీమవరంలో జిల్లాస్థాయి కార్యక్రమానికి పోటెత్తుతున్నారు. స్థానికంగా చిన్నపాటి సమస్యల పరిష్కారానికి కూడా కలెక్టరేట్‌కు హాజరవుతూ అర్జీలు అందిస్తున్నారు.

ప్రజాపక్షాన పోరాటాలకు వైఎస్సార్‌సీపీ కార్యాచరణ

పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు





అత్తిలిలో వైఎస్సార్‌సీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు. చిత్రంలో మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి, ఎమ్మెల్సీలు వంకా, కవురు, సమన్వయకర్తలు పీవీఎల్, గుడాల, హాజరైన పార్టీ శ్రేణులు

అత్తిలి: జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని సంస్థాగతంగా బలోపేతం చేసి, ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటాలు చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం అత్తిలిలో మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అధ్యక్షతన ఆయన నివాసంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో తణుకు నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముదునూరి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పూర్తిగా బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని పునఃనిర్మాణం చేయడంతో పాటు కార్యకర్తలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నామన్నారు. కేడర్‌లో నూతన ఉత్సాహం నింపేందుకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. త్వరలో జగన్ జిల్లాల్లో పర్యటించి ప్రతి నియోజకవర్గంలో నాయకులను కలుసుకుని వారితో సమావేశాలు నిర్వహిస్తారని చెప్పారు. కొత్త కమిటీలు ఏర్పడిన అనంతరం ప్రతినెలా నియోజకవర్గంలో ఏదో ఒక మండల సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లాలో అన్ని నియోజవర్గాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటుచేసి అనంతరం జిల్లా కమిటీలను రూపొందిస్తామన్నారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి అరెస్టులు చేయడంపై జగన్ ప్రత్యేక న్యాయవాదులను ఏర్పాటు చేశారని, సోషల్ మీడియా కన్వీనర్లు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

అన్నివేళలా అండగా..

మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కేడర్‌కు అన్నివేళలా అండగా ఉంటానన్నారు. సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. నూతనంగా నియమించే కమిటీలకు ఎంపికైన వారు కర్తవ్య విధులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ మోసపూరిత హామీలను ప్రజలు గమనిస్తున్నారని, పాలకులను ప్రజలు నిలదీసే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఉచిత ఇసుక అమలు దారుణంగా ఉందని, ఇసుక ధరలు గతంలో కంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల సమన్వయకర్తలు గుడాల గోపి, పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా కన్వీనర్లపై ప్రభుత్వం పెట్టే కేసులకు ఎవరూ భయపడవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు బుద్దరాతి భరణీప్రసాద్, ఉండవల్లి జానకి, అత్తిలి, తణుకు టౌన్, తణుకు రూరల్, ఇరగవరం మండల పార్టీ అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, అత్తిలి, తణుకు జెడ్పీటీసీ సభ్యులు అడ్డాల జానకి, ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మెహర్ అన్సారీ, నాయకులు వెలగల అమ్మిరెడ్డి, పెన్మెత్స రామరాజు, వెలగల సాయిబాబారెడ్డి, పోలినాటి చంద్రరావు, ఆకుల పండుస్వామి, సబ్బితి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

177 అర్జీల స్వీకరణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో 177 అర్జీలను జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, అధికారులు స్వీకరించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని జేసీ అన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి, డీఎల్‌డీఓ వై.దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- గణపవరానికి చెందిన వడ్లమూడి రామలక్ష్మమ్మ తనకు భర్త, పిల్లలు లేరని, అనారోగ్యం కావడంతో అప్పులపాలయ్యానని, తన సోదరి కుమారులకు తాను రాసి ఇచ్చిన 97 సెంట్ల భూ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తనకు స్వాధీన పరచాలని అర్జీ అందజేశారు.
- పెనుగొండకి చెందిన పుత్తినీడి పద్మ తమ ప్రాంతంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని విచారణ చేయాలని జేసీని కోరారు.
- తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన బలుసు సూర్యచంద్రరావు తన వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు.
- కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీవిశ్వేశ్వరరావు బీసీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

పక్కాగా ఓటర్ల నమోదు

ఏలూరు (మెట్రో): దోషరహిత ఓటరు జాబితాను రూపొందించడంపై సంబంధిత అధికారులు ధ్యాస పెట్టాలని పశుసంవర్థక శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా పరిశీలకుడు ఎంఎం నాయక్ చెప్పారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై వీఆర్వోలు, ఏఈఆర్వోలతో ఆయన సమీక్షించారు.

● కార్తీక సోమవారం శోభ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి



కాళ్ల : కాళ్లకూరులో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

హరహర మహాదేవ..

శంభోశంకర స్మరణలు మార్మోగాయి. శైవ, వైష్ణవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. జిల్లాలోని పంచారామక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశంచౌక్): సోమారామంలో..

మృతదేహాల మాయంపై నేడు జీజీహెచ్‌లో విచారణ

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ బోధనాస్పత్రిలోని మార్చురీలో అనాథ శవాల మాయం సంచలనంగా మారింది. ఏలూరు జీజీహెచ్‌లోని అధికారులు, మార్చురీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శవాలను భారీ రేటుకు విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఏలూరు జీజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో కమిటీ ప్రాథమిక విచారణ చేపట్టగా అవినీతి, అనాథ శవాల విక్రయాలు జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో దీనిపై రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. డీఎంఈ ఆధ్వర్యంలో ఇద్దరు వైద్యాధికారులతో కూడిన కమిటీని విచారణకు నియమించినట్టు సమాచారం. ఈ అధికారుల బృందం మంగళవారం ఏలూరు జీజీహెచ్‌లో విచారణ చేపట్టనున్నారని తెలిసింది. అలాగే జీజీహెచ్‌లో వైద్య పరికరాల కొనుగోళ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో పూర్వ జీజీహెచ్ సూపరింటెండెంట్, మరో వైద్యాధికారి కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ అవినీతి బాగోతంపై ముగ్గురు అధికారులతో కూడిన విచారణ కమిటీని నియమించినట్టు చెబుతున్నారు. ఆయా కుంభకోణాలపై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు సైతం జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

భక్తులతో పోటెత్తిన పట్టిసీమ



విశేషాలంకరణలో వీరేశ్వరస్వామి

పోలవరం రూరల్: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడతో పట్టిసం శివక్షేత్రం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించి, శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. వీరేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. క్షేత్ర పాలకుడైన భావన నారాయణ స్వామిని కూడా భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. సాయంత్రం లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవో చాగంటి సురేష్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు ఆట్యాపాట్యా జిల్లా జట్ల ఎంపిక

భీమవరం: ఈనెల 27వ తేదీన భీమవరం ఎస్సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్లో ఆట్యా-పాట్యా సీనియర్ పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆట్యాపాట్యా జిల్లా అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీన భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్: 98487 90115లో సంప్రదించాలని జిల్లా కార్యదర్శి జి కిరణ్‌వర్మ, జీపీసీ శేఖర్‌రాజు కోరారు.

వీఆర్‌లోకి ఎస్సై, ఏఎస్సైలు

తణుకు టౌన్: తణుకు రూరల్ ఎస్సై, ఏఎస్సైలను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రెండు గేదెల దొంగతనంపై నమోదైన కేసులో సెటిల్‌మెంట్‌కు సంబంధించి డబ్బులు చేతులు మారాయని సోషల్ మీడియాలో కథనాలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపారు. ఈనేపథ్యంలోనే రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి, ఏఎస్సై అంజిబాబులను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

దెందులూరు: రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. దెందులూరు మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన కాలి కాంతమ్మ గ్రామంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు సోమవారం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఏలూరు రైల్వే ఎస్సై పి సైమన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏదీ సురక్ష.. ప్రజారోగ్యంపై ఎందుకింత కక్ష?

- ఇప్పటివరకు ఒక్క వైద్య శిబిరం నిర్వహించని కూటమి ప్రభుత్వం
- సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- జగన్ ప్రభుత్వంలో ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట
- కార్పొరేట్ వైద్యం సైతం ఉచితంగా అందించిన వైఎస్సార్ సీపీ



తణుకు పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు (ఫైల్)



భీమవరంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో వైద్యం కోసం ప్రజల క్యూ (ఫైల్)

భీమవరం (ప్రకాశంచౌక్): కూటమి ప్రభుత్వంలో వైద్యం పడకేసింది. నూతన ప్రభుత్వం పగ్గాలు చేపట్టి ఆరు నెలల దాటినా ఇప్పటివరకు ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించడం లేదు. కనీసం సీజనల్ వైద్యసేవలు కూడా అందించేందుకు ఆసక్తి చూపడం లేదు. సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నా ఇప్పటివరకు ఒక్క వైద్యశిబిరం కూడా నిర్వహించలేదంటే కూటమి ప్రభుత్వానికి పేదల ఆరోగ్యంపై ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోంది. గతంలో ప్రజారోగ్యమే పరమావధిగా జగన్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో ముఖ్యంగా మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు స్థానికంగా అందించడం కోసం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో పేరుగాంచింది.

నాడు వార్డుల వారీగా సురక్ష క్యాంపులు

నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలోని పట్టణాల్లో వార్డుల వారీగా జగన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్యులచే ప్రజలకు వైద్యసేవలను అందించింది. మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను అన్నింటిని ఒకే చోటుకు తీసుకువచ్చి పట్టణంలోని పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించారు. గైనకాలజీ, జనరల్ మెడిసన్, గుండె వ్యాధులు, మూత్రపిండాలు, గ్యాస్ట్రో, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, మానసిక, కంటి, ఎముకలు తదితర స్పెషలిస్టులచే ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఉచితంగా 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందించేవారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలిగేది. ప్రతి క్యాంపులో రూ.100 నుంచి రూ.1500 విలువైన పరీక్షలు, రూ 500 నుంచి రూ.2 వేల విలువైన మందులు ఉచితంగా అందించేవారు. లక్షల రూపాయల ఖర్చు చేసే వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో అందించేవారు. కేన్సర్, లివర్, కిడ్నీ, ఇతర అనారోగ్య సమస్యలను ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో గుర్తించేవారు. జిల్లాలోని ఆరు పట్టణాల్లో 191 వార్డులకుగాను 150 వార్డుల్లో సురక్ష శిబిరాలు పూర్తి చేశారు. 60 వేల మందికి వైద్య సేవలు అందించారు. 2 వేల మందికి ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు, మెరుగైన వైద్యం అందించారు. 58 వేల మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 వేల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

నేడు సీజనల్ వ్యాధులకు సైతం దిక్కులేదు

కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెలల కాలంలో కనీసం సీజన్‌ల వ్యాధులకు జిల్లాలోని ఆరు పట్టణాల్లోని ఒక్క వార్డులో కూడా వైద్యశిబిరాలు నిర్వహించలేదు. రోజుల తరబడి జ్వరంతో పట్టణవాసులు బాధపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో చేసేదిలేక పేదలు ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిల వద్ద జనం క్యూ కట్టడంతో అక్కడ వైద్యులు ఎక్కువ మందికి వైద్యం అందించడం కష్టతరంగా మారింది. దీంతో ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్షలు, ప్రైవేట్ ఆస్పత్రిల్లో వైద్యం చేయించుకుంటున్నారు. పేదలు సైతం వైద్యం కోసం వేల రూపాయలు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

ఏలూరు టౌన్: అనుమానాస్పద స్థితిలో ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మండలం జాలిపూడికి చెందిన కలగర అనీల్ కుమార్, పూర్ణిమ (30) దంపతులు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. అనీల్‌కుమార్ స్థానికంగా ఉన్న ఓ సినిమా థియేటర్ క్యాంటీన్‌లో పనిచేస్తుంటాడు. పిల్లల చదువుల నిమిత్తం కొంతకాలంగా చాటపర్రులోని ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. ప్రస్తుతం అనిల్‌కుమార్ అయ్యప్ప మాల వేశారు. దీక్షలో ఉండటంతో 3 రోజులుగా జాలిపూడిలోని పీఠం వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో పూర్ణిమ, పిల్లలు ఆదివారం రాత్రి నిద్రించారు. సోమవారం ఉదయానికి పూర్ణిమ ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. నిద్రలేచిన కుమార్తె విషయాన్ని గమనించి తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. విషయం తెలుసుకున్న ఏలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కడుపునొప్పి తాళలేక, లేదా మరేదైనా కారణాలతో పూర్ణిమ ఆత్మహత్యకు పాల్పడిందనే విషయం తెలియాల్సి ఉంది. ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ ఈ ఘటనపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాజ్యాంగమే మనకు శిరోధార్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్‌పీడీ పాల్, సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగమే మనకు శిరోధార్యమని రాజ్యాంగ ధర్మ పరిషత్తు ఫౌండర్, జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్‌పీడీ పాల్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేట నందలి ఏఐఏవైఎస్ అండ్ ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 26వ తేదీన 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని కోరారు. మత, కుల, వర్గ వర్ణ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఆరోజున స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఉదయం 10.30 గంటలకు బైక్ ర్యాలీ, అనంతరం ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్ నందు రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకావిష్కరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీఆర్‌పీఎస్ నాయకులు పులవర్తి డేవిడ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా మహిళల జట్టు



జిల్లా పురుషుల జట్టు

తణుకు అర్బన్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా సీనియర్ కబడ్డీ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 24న తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా పురుషులు, మహిళల జట్లకు సంబంధించి 12 మందితోపాటు స్టాండ్‌బైగా మరో ముగ్గురు చొప్పున ఎంపిక చేసినట్లు వివరించారు. వీరంతా డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే 71వ రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల అధినేత బసవ రామకృష్ణ పోటీలను ప్రారంభించగా, సెలక్షన్ కమిటీగా ఏలూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రంగారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి.జాన్సన్, పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, టి.సత్యవేణి, ఎస్.సూర్యనారాయణ, ఎ.నాగేశ్వరరావు, కె.బాబూరావు పాల్గొన్నారు.

13 నుంచి జాతీయ నృత్యోత్సవాలు



అభినయ నృత్య భారతి నృత్యోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన అభినయ నృత్యభారతి 29వ జాతీయ నృత్యోత్సవాలు, నృత్య పోటీలు డిసెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు అంబికా కృష్ణ, అధ్యక్షుడు మనోహర్ గోపాల్ లునాని, వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య దువ్వి హేమ సుందర్ తెలిపారు. సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హేలాపురి లయన్స్ క్లబ్, సర్వీస్ ట్రస్ట్, హిందూ యువజన సంఘం, లయన్స్ జిల్లా 316జీ, దీపక్ నెక్స్ జెన్ సంస్థల సహకారంతో ఈ ఉత్సవాలను స్థానిక వైఎంహెచ్ఏ హాల్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సుమారు 10 రాష్ట్రాలకు చెందిన యువ కళాకారులు నృత్యకౌముది అవార్డులు స్వీకరించనున్నారని, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 400మంది చిన్నారులు కూచిపూడి, జానపద, బృంద నృత్య పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇదే సందర్భంలో నృత్య రంగంలో సేవలందించిన గురువులకు నృత్య తపస్వి, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సేవామూర్తులకు సేవాతపస్వి అవార్డులతో సత్కరించనున్నామన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా యార్లగడ్డ జగన్మోహన్ రావు, అధ్యక్షుడిగా లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు వ్యవహరిస్తారని తెలిపారు.

అద్దె కార్లతో ఉడాయిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కార్లతో డీఎస్పీ శ్రావణ కుమార్, సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: నగరంలో పలు కార్లను అద్దెకు తీసుకుని ఉడాయిస్తున్న ఇద్దరిని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన ముంగర అభిషేక్, ఏలూరు టూ టౌన్ పరిధిలోని పత్తేబాద ప్రాంతానికి చెందిన యల్లపు భానుచందర్‌గా పోలీసులు గుర్తించారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ శ్రావణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఏలూరు నగరంలోని టూటౌన్, త్రీటౌన్, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు తమ కార్లను అద్దెకు తీసుకుని నెలలు గడుస్తున్నా తిరిగి ఇవ్వడం లేదని, వాటిని తాకట్టు పెట్టారని ఆయా పోలీస్ స్టేషన్‌లో పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావును ప్రత్యేక విచారణ అధికారిగా నియమించారు. దీంతో నిందితులు ముంగర అభిషేక్, యల్లపు భానుచందర్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి ఆరు కేసులకు సంబంధించి ఆరు కార్లును రికవరీ చేశారు. కేసును త్వరితగతిన ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన సీఐ కోటేశ్వరరావు, ఎస్సైలు ప్రసాద్, రాంబాబులను డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో చోరీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం స్థానిక అచ్చుగట్లపాలెం మారుతి సెంటర్ నందు ఉన్న శ్రీ లక్ష్మీ పిల్లల ఆసుపత్రిలో దుర్గారావు నైట్ డ్యూటీ చేస్తున్నాడు. రాత్రి 11.45 గంటల సమయంలో ఆసుపత్రిలోకి నలుగురు వ్యక్తులు చొరబడి దుర్గారావుపై దాడి చేసి ఆసుపత్రిలో ఉన్న మెడికల్ షాపులో సుమారు రూ.2 లక్షలు అపహరించుకుపోయారు. ఆసుపత్రి సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కె. రజనీ కుమార్ తెలిపారు.

పోలీసులపై తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

ఏలూరు టౌన్: సోషల్ మీడియాలో పోలీసులపై తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. గత కొద్ది రోజులుగా ఏలూరు త్రీటౌన్ సీఐ తన కారు వాడుకుంటూ తనను వేధింపులకు గురి చేస్తున్నాడని ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి తెలిపిన వీడియో వైరల్‌గా మారింది. పోలీసులు ఈ వీడియోలో ఉన్న వ్యక్తి ఏలూరుకు చెందిన గుప్తాగా గుర్తించి అతడి నుంచి వివరాలు సేకరించి అతడిని విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. తన కారును ఒక వ్యక్తి అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టాడని, దీనిపై అప్పట్లో ఏలూరు త్రీటౌన్ సీఐకి ఫిర్యాదు చేయగా స్పందించకపోవడంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేసేందుకు మంగళగిరి వెళ్లినట్లు గుప్త తెలిపాడు. అయితే త్రీటౌన్ సీఐ కారు, తన కారు ఒకే రంగులో ఉండడంతో పొరబడి ఆయన తన కారును వాడుకుంటున్నారని భ్రమపడి మంగళగిరిలో విలేకరుల ముందు పొరపాటుగా చెప్పానని, క్షమించాలని పోలీసులను కోరారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు



సారా సామగ్రిని ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం: సారా బట్టీలపై ఎక్సైజ్ శాఖ కొరడా ఝుళిపించింది. ఈనెల 18వ తేదీన సారా బట్టీల అడ్డా.. గంగవరం మెట్ట శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ శాఖ స్పందించింది. ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి నేతృత్వంలో గంగవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో విస్తృత దాడులు నిర్వహించారు. కొండ వద్ద ఉన్న సారా తయారీ కేంద్రాన్ని గుర్తించి సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో ఇటీవల జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొయ్యేటిపాడు గ్రామానికి చెందిన ముప్పిడి కృపావరం ఈనెల 21న పెనుమంట్ర శనివారం మార్కెట్‌లో సైకిల్‌పై వెళుతుండగా వెనుకనుంచి బొలేరో వాహనం ఢీకొంది. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్సకోసం కాకినాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అదేవిధంగా గణపవరం మండలం మొయ్యేరుకు చెందిన జవదుల ధనరాజు(34) ఆదివారం రాత్రి బ్రాహ్మణచెర్వు- పాలమూరు రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళుతూ కంకర గుట్టలను ఎక్కించబోయి అదుపు తప్పడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని తణుకు, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

స్కూటీ డిక్కీలోని నగదు చోరీ

భీమడోలు: స్కూటీ డిక్కీలో నగదు చోరీ చేసిన ఘటన భీమడోలు జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన రైతు నందమూరి సత్యనారాయణకు తన వరి పంటను విక్రయించగా వచ్చిన రూ.4.50 లక్షలు భీమడోలు యూనియన్ బ్యాంకులో జమ అయ్యాయి. ఆ నగదును సోమవారం బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకుని తన స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. తిరిగి తన ఇంటికి వెళుతూ భీమడోలు జంక్షన్‌లోని గోకుల్ ఫ్యాన్సీ షాపు వద్ద ఆగాడు. అక్కడ వస్తువులు కొనుగోలు చేసి బయటకు వచ్చి చూసేసరికి తన స్కూటీ డిక్కీ పగుల కొట్టి ఉండడం, అందులోని రూ.2.5 లక్షల మాయం కావడం గుర్తించాడు. దీనిపై బాధితుడు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్త ఆగడాలను అడ్డుకోవాలని వినతి



ఏలూరులో మీకోసంలో అర్జీని అందజేస్తున్న రైతు సత్యనారాయణ

నూజివీడు: టీడీపీ కార్యకర్త ఆగడాలను అడ్డుకోవాలని కోరుతూ ఏలూరులోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో రైతు జంగంగూడెంకు చెందిన కొల్లి సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. తన భూమిలోని ఆయిల్‌పామ్ మొక్కలను 15 రోజుల క్రితం దేవరగుంటకు చెందిన టీడీపీ కార్యకర్త చేకూరి వెంకటరామయ్య దౌర్జన్యంగా పీకివేశాడని, పొలానికి వేసిన ఫెన్సింగ్ రాళ్లను విరగ్గొట్టడంతో పాటు ముళ్ల తీగను తొలగించాడని సత్యనారాయణ తెలిపారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. ఇటీవల మొక్కజొన్న సాగు చేయగా మళ్లీ ఆదివారం రాత్రి వెంకటరామయ్య ట్రాక్టర్‌తో పంటను ధ్వంసం చేశాడని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. డీఎస్పీ శ్రవణ్‌కుమార్ అర్జీని పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధిత రైతు సత్యనారాయణ తెలిపారు.

వాహనాల చోరీల కేసులో ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

పాలకోడేరు: ద్విచక్ర వాహనాలు, ఆటోలను చోరీ చేస్తున్న ఇద్దరు యువకులను పాలకోడేరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, పాలకోడేరు ఎస్సై మంతెన రవి వర్మ వివరాలు వెల్లడించారు. మోగల్లు గ్రామానికి చెందిన రెడ్డి శివ (20), గొల్లలకోడేరు గ్రామానికి చెందిన ఈథా ప్రకాష్ (19) ఇటీవల విస్సాకోడేరులో రెండు మోటార్ సైకిళ్లు, మోగల్లులో ఒక మోటార్ సైకిల్, భీమవరం రూరల్ మండలం దేగాపురంలో ఆటో, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో పల్సర్ మోటార్ సైకిల్ చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.5,19,000. నిందితులు మోగల్లు గ్రామ శివారులోని ఓఎన్జీసీ సైట్ వద్ద చెట్ల పొదల్లో దాచిపెట్టిన నాలుగు మోటార్ సైకిళ్లను ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

క్లుప్తంగా

ఇంటి మరుగుదొడ్లను వినియోగించాలి



మొదుగ గుంట గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోని మరుగుదొడ్డిని వినియోగించాలని మొదుగ గుంట సర్పంచ్ కట్టా సత్యవతి అన్నారు. సోమవారం మండలంలోని మొదుగ గుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్డి వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన చేయరాదని హితవు పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం, పీడీ శివ, ఎంఆర్‌సీఎం రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ఉప్పరగూడెంలో సగర కార్తీక వన సమారాధన



మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జరిగిన సగర కార్తీక వన సమారాధన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలోని సగర కార్తీక వన సమారాధన సోమవారం నిర్వహించారు. మొదుగ గుంట గ్రామ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సగర సామాజికవర్గానికి చెందిన వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సగర సంఘ నాయకులు కర్నాటి పోలిరెడ్డి, కొండలరావు, సగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, గొల్లపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న జీఎంఏ కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు దివ్యాంగులకు, చిన్నారులకు అందిస్తున్న వివిధ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. లయన్స్ హంగర్ రిలీఫ్‌లో భాగంగా క్లబ్ జీఎంఏ కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో లయన్ మానే వర ప్రసాద్ సౌజన్యంతో పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులకు అన్నదానం, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రా ఆంజనేయస్వామి, కోపల్ల సాయి సత్యనారాయణ రాజు, కలవలపల్లి సత్యనారాయణ, ఆకుల సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన



అత్తిలిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

అత్తిలి: మండలంలోని షిర్డీసాయిబాబా వార్షిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కార్తీక దీపాలతో శోభిల్లిన పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయం



రామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద కోటి దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కోటి దీపోత్సవం నిర్వహించారు. అయ్యప్ప దీక్షాధారులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీప కాంతులతో ఆలయం దేదీప్యమానంగా వెలుగొందింది. నల్లమోతు చిట్టెమ్మ, ఆకుల శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డి పరకలను పట్టి మేటుగా పేర్చి!

- యంత్రాలతో గడ్డి సేకరణ సులభం
- రైతుల డబ్బు, సమయం ఆదా



తేతలిలో ఎండు గడ్డిని యంత్రాలతో కట్టలుగా కడుతున్న దృశ్యం



కోనాలలో పిరమిడ్‌లా పేర్చిన ఎండు గడ్డి కట్టలు

తణుకు టౌన్ : వరి చేలల్లో పంట కోత అనంతరం పశువులకు దాణాగా ఉపయోగించే గడ్డిని ప్రతి పరకనూ ఏరి కట్టలుగా కట్టడంలో యంత్రాలను ఉపయోగించడం వలన రైతులకు ఖర్చులు తగ్గి తక్కువ సమయంలోనే పనులు పూర్తవుతున్నాయి. ఈ గడ్డిని కూలీల సహాయంతో పశువుల పాకల వద్దకు చేర్చి దానిని మేటుగా వేస్తున్నారు. వ్యవసాయంలో వచ్చిన యాంత్రీకరణతో ఈ గడ్డిని తక్కువ ఖర్చుతో కూలీలకు, రైతులకు శ్రమ తగ్గిస్తున్నాయి. దీంతో రైతులకు తక్కువ సమయంలోనే, కూలీల కన్నా తక్కువ రేటుకే వరి గడ్డి దొరకడంతో పాడి రైతులతో పాటు పాల డైరీల నిర్వాహకులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులకు వరి గడ్డి ద్వారా ఫైబర్ అందుతుంది. పాడి పశువులకు పచ్చగడ్డి, ఇతర దాణాలతో పాటు ఎండు గడ్డి కూడా అవసరం. కొంత మంది రైతులు తమ పొలాల్లోని ఎండు గడ్డి సేకరణకు గతంలో కూలీలను ఉపయోగించే వారు. ఈ పద్ధతిలో ఎకరా వరిగడ్డిని పాకల వద్దకు చేర్చడానికి రూ.4 వేల వరకూ ఖర్చయ్యేదని రైతులు పేర్కొంటున్నారు. అయితే వరి గడ్డిని కట్టలుగా కట్టేందుకు ప్రత్యేక యంత్రాలు అందుబాటులోకి రావడంతో పొలంలోని ఎండు గడ్డి పరకలను మొత్తం ఉండలా చుట్టేస్తున్నాయి. దీంతో గడ్డి ఎక్కడా వృథా కావడం లేదని రైతులు అంటున్నారు. ఈ యంత్రాల ద్వారా కట్టలుగా చుట్టిన కట్టలను తరలించడానికి, భద్రపరచడానికి సులభతరం అయ్యిందని రైతులు, డైరీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. పొలంలో యంత్రం ద్వారా చుట్టిన కట్టకు ఒక్కో కట్టకు రూ.30 యంత్రానికి, మరో రూ.30 పొలం నుంచి పశువుల పాక వద్దకు రవాణా చార్జీలు అవుతున్నట్లు తెలిపారు. ఒక ఎకరా పొలంలో 40 నుంచి 50 కట్టలు వస్తాయని ఒక్కో కట్ట సుమారు 30 కేజీల వరకూ ఉంటుంది. ఒక కట్ట నాలుగు పశువులకు ఒక సారి సరిపోతుందని పశు పోషకులు పేర్కొంటున్నారు. దీనికి రూ.2500 నుంచి 3000 వరకూ ఖర్చవుతుందని పేర్కొంటున్నారు. ఇలా గడ్డి మేటు నుంచి ప్రతి రోజూ పశువులకు మేత వేసేటప్పుడు కూడా వృథా కాకుండా పశువుల అవసరం మేరకు గడ్డి వినియోగించుకోవచ్చని పేర్కొంటున్నారు.

తక్కువ సమయంలోనే



వరి చేలో ఎండుగడ్డిని కూలీల ద్వారా తరలించడం చాలా రోజులు పడుతుంది. అదే యంత్రాల ద్వారా తక్కువ సమయంలో మొత్తం గడ్డి కట్టలుగా కట్టేస్తుంది. దీంతో రైతులకు సమయంతో పాటు వ్యయం కూడా తగ్గుతుంది.

– పాలా ఈశ్వరుడు, రైతు, తేతలి

వినియోగంలో వృథా తగ్గుతుంది



యంత్రాల ద్వారా ఎండు గడ్డిని కొనుగోలు చేసి పశువుల పాకల వద్ద నిల్వ చేయడం చాలా సులభం. దీని వలన రోజూ ఎండు గడ్డి వినియోగంలో చాలా వరకూ వృథా తగ్గుతుంది. పాల డైరీ నిర్వాహకులకు యంత్రాల ద్వారా కట్టలు కట్టడం చాలా సమయం, ఖర్చులు తగ్గుతున్నాయి.

– తమరాని రమేష్ కుమార్, పాల డెయిరీ నిర్వాహకుడు, తణుకు

విద్యార్థినులకు బహుమతులు

తణుకు టౌన్: ఇటీవల ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పురుషుల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై నిర్వహించిన క్విజ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థినీలు బీ అమ్మాజీ, కే ఝాన్సీ నాగ భవానీలు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం



తణుకులో అయ్యప్పస్వామికి అన్నాభిషేకం

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి సమీపంలో వేంచేసియున్న శ్రీ పంచాయతన ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో సోమవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ గురుస్వామి వేమూరి చలపతి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సిరిశెట్టి శ్రీనివాస్ సౌజన్యంతో 10 క్వింటాళ్ల అన్నంతో స్వామివారికి అన్నాభిషేకం జరిపించినట్లు మాలదారులు తెలిపారు. అయ్యప్ప మాలదారులు అధికసంఖ్యలో అన్నాభిషేకంలో పాల్గొన్ని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భారత రాజ్యాంగంపై అవగాహన అవసరం



తణుకులో రాజ్యాంగ పీఠికను ఆవిష్కరించిన విద్యార్థులు, హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు జాస్తి సీతామహాలక్ష్మి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వకృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తోట వరలక్ష్మి మాట్లాడుతూ భావి భారత పౌరులకు రాజ్యాంగ స్ఫూర్తిని అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కలిగించిందని స్పష్టం చేశారు. 26వ తేదీన రాజ్యాంగ పీఠికను పఠించడంతోపాటు ప్రతిజ్ఞను చేయిస్తామని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ప్రచార వేదిక ప్రతినిధి జి.ఉష, ఉపాధ్యాయులు కె.పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



ఇరగవరం మండలం రేలంగి జంక్షన్‌లో ఉన్న కూటమి పార్టీల ఫ్లెక్సీ



రేలంగి మొయిన్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయని దృశ్యం

ఇరగవరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ బేఖాతర్ చేస్తూ తణుకు నియోజకవర్గంలోని పలుచోట్ల రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పది రోజులు గడుస్తున్నప్పటికీ కూటమి పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను నియోజకవర్గంలో రేలంగి, ఇరగవరం, తదితర గ్రామాల్లో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు సైతం ముసుగులు వేయకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వ ఫ్లెక్సీలను ఉంచి వైఎస్సార్‌సీపీకి చెందిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించడం వివక్షతతో కూడుకున్న చర్య అని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు, రిటర్నింగ్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల గౌరవ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని యాగర్లపల్లిలో సోమవారం జరిగిన మాల మహానాడు సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునని తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో దేశ వ్యాప్తంగా వర్గీకరణ చేస్తే తమకు ఎటువంటి అభ్యంతరం ఉండదని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని మంగరాజు డిమాండ్ చేశారు. ఆర్టికల్ 338 ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నందున మరో కమిషన్ నియమించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కులాలు మధ్య చిచ్చు పెట్టడం సరికాదని, మానుకోవాలని సీఎం చంద్రబాబుకు హితవు పలికారు. ఎస్సీలు ఐక్యత లేకపోతే వర్గీకరణ చేస్తారని, తక్షణమే ఎస్సీలు సఖ్యతగా ఉండి వర్గీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న మాలలు అందరూ పార్టీలకు అతీతంగా రోడ్లపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగరాజు, జైపాల్, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమ పుట్టుకను నివారించాలి



తణుకులో కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: దోమ పుట్టుకకు చెక్ పెట్టగలిగితే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తణుకు వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని డీఎల్‌కే రోడ్డు, 9వ వార్డులో సోమవారం నిర్వహించిన కీటకజనిత వ్యాధులపై అవగాహన, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఇంటి ఆవరణల్లో అవసరంలేని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. డ్రెయినేజీల్లో చెత్త వ్యర్థాలు వేయరాదని, మునిసిపల్ చెత్త సేకరణ వాహనాలకు ఇంటి చెత్తను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు కె.మార్తమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్పపీడనంతో అన్నదాతల బెంబేలు



తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ధాన్యం రాసులపై బరకాలు కప్పుతున్న దృశ్యం

పెంటపాడు: ప్రస్తుతం ఖరీఫ్ సీజనల్‌లో ఎప్పుడు తుఫాను వస్తుందో తెలియక అన్నదాతలు నిత్యం ఆందోళన చెందుతున్నారు. వరిసాగు కోసం నాట్లు వేసిన నాటి నుంచి తుఫాన్లతోనే రైతన్నలు పోరు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. జూలై, సెప్టెంబరు, అక్టోబర్‌లో తుపాన్లు, అధిక వర్షాలతో రైతులు చాలా వరకు నష్టపోయారు. నవంబర్ రెండో వారం నుంచి కోతల ప్రారంభించి, పంటను ఒబ్బిడి చేసుకోవచ్చని ఆశలు పెట్టుకొని మసూళ్లు ప్రారంభించిన రైతన్నలకు..వాతావరణంశాఖ ప్రకటన కునుకులేకుండా చేస్తోంది. 70శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. కళ్లాల సదుపాయం లేకపోవడంతో యంత్రాల ద్వారా కోసిన వరి ధాన్యాన్ని సమీపంలోని రోడ్లపై ఆరబెడుతున్నారు. సరైన తేమశాతం వస్తేనే గానీ మిల్లర్లు కొనే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ధాన్యం బాగా ఆరేందుకు వీలుగా రహదారులే రైతులకు దిక్కయ్యాయి. ఇప్పటివరకు కోసిన పంటను మిల్లర్లకు తరలించారు.

భక్తజనంతో పోటెత్తిన శైవక్షేత్రాలు



అత్తిలి: ఉమాసిద్ధేశ్వరస్వామివారికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): మల్లిఖార్జునస్వామి



తణుకు టౌన్ పైడిపర్రు శివాలయంలో కార్తీక పూజలు చేస్తున్న భక్తులు

అత్తిలి: కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాలలో హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తుల నామ స్మరణతో మారుమ్రోగాయి. అత్తిలిలో ఉమాసిద్దేశ్వర స్వామి ఆలయానికి వేకువజామున పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించారు. మండలంలోగల శైవక్షేత్రాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి అభిషేక పూజలు జరిపారు.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు

తణుకు టౌన్: కార్తీక సోమవారం సందర్భంగా తణుకు మండలంలోని వివిధ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తణుకు రూరల్ మండలం వేల్పూరు, తేతలి, దువ్వ, కోనాల, కొమరవరం, పైడిపర్రు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు సోమవారం తెల్లవారు జాము నుంచే స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పూరు గ్రామంలోని రుద్రేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ కార్తీక సమారాధనను నిర్వహించారు. పైడిపర్రులోని వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలతో పాటు గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అఖండ జ్యోతులు, పుష్పాలతో భక్తులు స్వాగతం పలికారు.

పెద్ద శివాలయంలో విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని పెద్ద శివాలయం వద్ద భ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఏకవార రుద్రభిషేకం నిర్వహించారు. ఆకాశ దీపాలు వెలగించారు. నక్షత్రమాల, ఆలయం అంతా దీపాలను వెలిగించారు. ఈ పూజలలో కొట్టు రాము, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

51,157 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని 51,157 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం మండలంలో 21,283, పెంటపాడు మండలంలో 26,010 మెట్రిక్ టన్నులు, గణపవరం మండలంలో 3864 మెట్రిక్ టన్నులు ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ నెల 26న బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం వాయుగుండంగా మారి వర్షాలు పడే అవకాశం ఉందనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే మూడు రోజులు కోతలు కోయరాదన్నారు. ధాన్యాన్ని తడవకుండా షెడ్డులలో భద్రపర్చుకోవాలన్నారు. బస్తాలలో పట్టిన ధాన్యాన్ని వెంటనే రైసు మిల్లులకు ఆర్ఎస్‌కేల ద్వారా తరలించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం టౌన్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ విద్యుత్ ఈఈ కె.నరసింహమూర్తి సోమవారం రాత్రి వివరాలు వెల్లడించారు. జువ్వలపాలెం నుంచి సవితృపేట వరకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు, మార్కెట్ ఏరియా, సవితృపేట, నవ్వారు పేట, ఏలూరు రోడ్డు, తణుకు రోడ్డులలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వార్డుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. కడకట్ల పరిధిలోని ఆరోగ్య కేంద్రం పరిధిలో 38వ వార్డులో సోమవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు పరిశీలన, ఆరోగ్య అవగాహన, ర్యాలీలు జరిగాయి. వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక జనిత ప్రదేశాలను గుర్తించి నిలువరిద్దామని, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికడదామని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని పలు సూచనలు చేశారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు చంద్రకళ, కార్యకర్త కనకదుర్గ, వార్డు ఇంచార్జి పి.రాంబాబు, సహాయకులు కాంతారావు, ఆశా అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



తణుకులో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఆదినారాయణ

తణుకు అర్బన్: మానవ తప్పిదం వలనే చిన్న రోడ్డు ప్రమాదాల్లో సైతం ప్రాణాలు పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తణుకు ట్రాఫిక్ ఎస్ఐ డి.ఆదినారాయణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా తణుకు నరేంద్ర సెంటర్లో సోమవారం వాహనదారులు, ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తమ ప్రయాణాల్లో సురక్షితంగా ప్రయాణించాలని తనపై తన కుటుంబం ఆధారపడి ఉందన్న ఒకే ఒక్క విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. హెల్మెట్ పెట్టుకుని వాహనం నడిపిన సందర్భాల్లో ప్రమాదం పెద్దదైనా చిన్నపాటి గాయాలతో తప్పించుకుంటున్నారని హెల్మెట్ లేని ఘటనల్లో తలకు గాయమై ప్రాణం మీదకు వస్తుందని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు కూడా వాహనం నడిపే సందర్భాల్లో మద్యం సేవించి ఉండకూడదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని వివరించారు. ముఖ్యంగా మద్యం సేవించి ఆటో నడిపి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రూ.10 వేలు నుంచి రూ. 20 వేలు వరకు న్యాయస్థానం జరిమాన విధిస్తుందని రోడ్డు నిబంధనలు పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఏర్పాటు

అత్తిలి: మండలంలోని స్కిన్నెరపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం ఏర్పాటు చేసారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తొత్తరమూడి శ్రీనివాస్, తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు కల్యాణ్ అబ్బదాసరి, అత్తిలి మండల అధ్యక్షుడు గెద్దం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యార్లగడ్డ రమేష్, వైస్ ప్రెసిడెంట్‌గా యజ్జల నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా యార్లగడ్డ గణేష్, కార్యదర్శిగా సాధనాల చందు, సభ్యులుగా చదలవాడ ప్రసన్న, సవరపు వంశీ, యార్లగడ్డ వర్మలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లేటి వినయ్, కార్యదర్శి కోడెల్లి సత్యమూర్తిరాజు, బడతాల రాజేష్ పాల్గొన్నారు.

26న సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం: ఈనెల 26న సైబర్ నేరాల నియంత్రణ, వాటి నివారణ, పాటించాల్సిన సూచనలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం స్టేట్ బ్యాంకు మేనేజర్ దశిక శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఉషా గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా నష్టపోకుండా, వాటి భారీనపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన జరుగుతుందని తెలిపారు. సదస్సుకు రీజినల్ మేనేజర్ రమేష్ నాయుడు, డీఎస్పీ విశ్వనాథ్, సైబర్ నిపుణులు సాయి సతీష్‌లు హాజరకానున్నట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్స్, ఖాతాదారులు, పెన్షనర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.